ఎందుకింత నిర్లక్ష్యం?

- రోగులతో కిటకిటలాడిన సీహెచ్‌సీ
- 8 మంది వైద్యులకు గాను ఇద్దరే విధులకు
- వైద్యం అందక గంటల కొద్ది నిరీక్షించిన బాధితులు



రోగులతో కిటకిటలాడుతున్న యాచారం సీహెచ్‌సీ

యాచారం: ప్రజా వైద్యం పట్ల ప్రభుత్వ వైద్యాధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేసే వైద్యులు ఆ తర్వాత రోజుల్లో ఆస్పత్రికి రావడం మానేస్తున్నారు. యాచారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి సోమవారం మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వచ్చారు. విషజ్వరాలు, కాళ్లు, కీళ్లు, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రికి 250 మందికి పైగా వచ్చారు. సకాలంలో వైద్యులు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాచారం సీహెచ్‌సీలో మొత్తం 8 మంది వైద్యులు ఉండగా సోమవారం కేవలం మృదుల, రాజ్యలక్ష్మిలు మాత్రమే వచ్చారు. పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు వచ్చారు. వచ్చిన ఇద్దరు వైద్యులు రోగులకు సేవలు అందించడం కష్టంగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ కావడంతో యాచారం సీహెచ్‌సీకి రోగుల సంఖ్య క్రమేపి పెరుగుతుంది. ప్రజలు ఆసక్తితో ప్రభుత్వాసుపత్రికి వస్తుంటే వైద్యులు సకాలంలో ఆస్పత్రికి రాకపోవడం, వచ్చిన మధ్యాహ్నం వరకే ఉండి వెళ్లిపోవడంతో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. రెండు రోజుల క్రితమే యాచారం సీహెచ్‌సీకి పక్కా భవనం కోసం రూ. రెండు కోట్ల నిధులతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ ఉన్నతాధికారులు నిత్యం 8 మంది వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ, వారం రోజుల గడవక ముందే వైద్యులు తమ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు.

ప్రజా సేవకుడిగా పని చేస్తా

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: ఇబ్రహీంపట్నం నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రజాసేవకుడిగా పని చేస్తానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లవెల్లి, మాల్ గ్రామాల నుంచి వంద మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయడానికి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 15 ఏళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషి చేసినని తెలిపారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింతా అభివృద్ధి చేసి నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో ప్రశాంత్‌రెడ్డి, రమేష్, మహేష్, బ్రహ్మచారి, మోహిన్, దస్తగిరి, జీవిద్ ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, సీనియర్ నాయకులు యాదయ్యగౌడ్, యాదయ్య, మల్లేష్, రాములు, లక్ష్మీపతిగౌడ్, శివ, రవిగౌడ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

క్రీడలతో స్నేహభావం మెరుగు

- జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతోందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండలంలోని గానుగుమార్లతండా గ్రామ పంచాయతీలో జర్పుల రాధాకృష్ణ 20వ జయంతి సందర్భంగా, ఇటీవల నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన జీఎంటీ కింగ్స్‌కు రూ.10 వేలు, రన్నరఫ్‌గా నిలిచిన జీఎంటీ జూనియర్స్‌కు రూ.6 వేల నగదును జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక వికాసంతో పాటు, ఒత్తిడిని జయించవచ్చని, ఆరోగ్య జీవితానికి క్రీడలు దోహదపడుతాయని అన్నారు. విద్యార్థులు, యువకులు చదువుతో పాటు, క్రీడలపై దృష్టిసారించాలన్నారు. గ్రామీణస్థాయి క్రీడాకారులకు స్వచ్ఛంద సంస్థలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సాహం అందించి, వారిలో దాగి ఉన్నా ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఆనంద్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, నాయకులు రమేశ్, సేవ్యా, పాండు, రూప్‌సింగ్, రాజు, గణేశ్, ఇర్షాద్, వెంకటయ్య, సక్రు ఉన్నారు.



విజేతలకు నగదు బహుమతి అందిస్తున్న దశరథ్‌నాయక్

చిన్నారుల చదువుకు ట్రస్టు చేయూత

తలకొండపల్లి: నిరుపేద విద్యార్థుల చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన ఎగిలిశెట్టి లక్ష్మి, శేఖర్‌ల దంపతుల పిల్లలైన జ్యోష్ణ 9వ తరగతి, మనోజు కుమార్ 10వ తరగతి చదువుతున్నారు. శేఖర్ ఇటీవల కిడ్నీ వ్యాధితో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో పిల్లలిద్దరూ చదువు కష్టంగా మారింది. ఫీజులు ఎలా కట్టాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికుల సహకారంతో వారు ఉప్పల వెంకటేశ్‌ను కలుసుకొని చదువుకోడానికి సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన ట్రస్టు ద్వారా చదివిస్తానని, ఖర్చులు తానే భరించి ఉన్నత విద్యనందిస్తానని భరోసా ఇచ్చారు. రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, మనోహర్, శ్రీను, సాయిలు, వీరస్వామి గౌడ్, మురళి, నాయకులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

మండలం ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదు

- వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలముగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకుల చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 50 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గట్టుఇప్పలపల్లి అభివృద్ధిలో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నా కూడా మండలం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. గతంలో 41 రోజులు, ప్రస్తుతం 50 రోజులుగా దీక్షలు కొనసాగుతున్నాయని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి లోపించడం కారణంగానే మండలం ఏర్పాటు కావడం లేదని ఆయన ఆరోపించారు. సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, చెన్నయ్య, రాజు, చంద్రయ్య, మోహన్, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.



గట్టుఇప్పలపల్లిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, వైస్ ఎంపీపీ

పత్తి పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అరుణకుమారి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి, చెన్నంపల్లి గ్రామాల్లో సోమవారం రైతులు సాగుచేసిన వానాకాలం పంటలను మండల వ్యవసాయాధికారి అరుణకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. పత్తిలో పోషక లోపాల నివారణకు ఫార్ములా4 ఎకరానికి 400 గ్రాములు వేయాలని సూచించారు. వరిలో కాండం తొలచు పురుగు నివారణకు పటేరా గుళికలు ఎకరాకు నాలుగు కిలోలు ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, రైతులు సరస్వతమ్మ, సోని, లక్ష్మయ్య, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- చైర్‌పర్సన్ స్వప్న

హయత్‌నగర్: మున్సిపాలిటీలోని అన్ని కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధిలో మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని పస్మాముల్లో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, రూ.23 లక్షలతో నిర్మించే అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. సందర్భంగా స్వప్న మాట్లాడుతూ... కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని సూచించారు. మున్సిపాలిటీలో గుర్తించిన మురికివాడల్లో ప్రజల సమస్యలను తీర్చేందుకు ప్రాధాన్యత ఇస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈ అశోక్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు శంకరయ్య పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న స్వప్న తదితరులు

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

- సీవీఆర్ కళాశాల చైర్మన్ రాఘవ



కంప్యూటర్లు అందజేస్తున్న సీవీఆర్ కళాశాల చైర్మన్ రాఘవ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ సి.రాఘవ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.10 లక్షల విలువైన 35 కంప్యూటర్లను ఉచితంగా విద్యార్థులకు అందజేశారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ రాఘవ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు చదువుతున్న బడులకు తమ వంతు సహకారం అందిస్తున్నమన్నారు. విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని కోరారు. కంప్యూటర్ విద్యా ఈ కాలంలో చాలా అవసరమన్నారు. అనంతరం ఎంపీపీ పీ.కృపేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నం దొడ్డ, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాములు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సురేందర్, ఉపాధ్యాయులు దామోదర్, సీవీఆర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి



ఆమనగల్లు: పుట్టల్లో పాలు పోస్తున్న మహిళలు



కడ్తాల్: మైసిగండిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: మండలం కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం నాగుల పంచమి వేడుకలను మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయంలో నాగదేవతకు, పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయాలను దర్శించుకుని పూజలు జరిపారు. చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించారు.

ఆమనగల్లు: శ్రావణమాసం సందర్భంగా నాగుల పంచమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని వివిధ దేవాలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పుట్టల్లో పాలుపోసి మహిళలు పూజలు చేశారు.

బీఆర్‌ఎస్ సంబురాలు



కడ్తాల్: సంబరాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు చెబుతున్న నేతలు



ఆమనగల్లు: బాణాసంచా కాలుస్తున్న నేతలు



తలకొండపల్లి: టపాసులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న నాయకులు

బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల దృష్ట్యా సోమవారం అసెంబ్లీ అభ్యర్థులను సీఎం కేసీఆర్ ప్రకటించారు. కల్వకుర్తికి మరోసారి జైపాల్ యాదవ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలకు టికెట్లు కేటాయించడంతో పార్టీ శ్రేణుల ఆనందంలో మునిగితేలారు. టపాకులు కాల్చి, డ్యాన్స్ వేస్తూ సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఒక్కరిఒక్కరు తినిపించుకొని సంతోషం వ్యక్తం చేశారు. – ఇబ్రహీంపట్నం

మొక్కలు నాటి సంరక్షించాలి



హయత్‌నగర్: మొక్కలు నాటి వాటిని సంరక్షించడం విద్యార్థులు నిత్యకృత్యంగా మార్చుకోవాలని ప్రముఖ సినీ నటుడు నోయల్, ఫిట్‌నెస్ ట్రైనర్ మోన్‌లాల్ అన్నారు. సోమవారం కుంట్లూర్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలను పెంచడం ఒక్కటే మార్గమని, ప్రకృతి సమతుల్యతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య, డైరెక్టర్ నవీన్, ప్రిన్సిపాల్ బాలరాజ్, ఏఓ శ్రీధర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఘన స్వాగతం

కడ్తాల్: సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా ప్రకటించిన అనంతరం, సోమవారం సాయంత్రం మండల కేంద్రానికి వచ్చిన కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే స్థానిక అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు స్వీట్లు తినిపించి, శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గం రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, ప్రియారమేశ్ ఉన్నారు.



కడ్తాల్: ఎమ్మెల్యేకు స్వీటు తినిపిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

పలు అంశాలపై విద్యార్థినులకు శిక్షణ

ఇబ్రహీంపట్నం: వాయిస్ ఫర్‌గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ సోమవారం ఇబ్రహీంపట్నం వినోబానగర్ నల్లకంచె గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థినులకు పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించింది. సరూర్‌నగర్, మహేంద్రహిల్స్, ఆర్‌కేపురం, నార్సింగి, శంకర్‌పల్లి, నల్లకంచె గురుకుల విద్యాలయాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థినులకు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం, సమాజ సేవ, ఆపద సమయంలో సులువుగా బయటపడటం, ఎదుటి వారికి ఇబ్బంది కలుగకుండా మాట్లాడటం తదితర అంశాలపై పది రోజుల పాటు శిక్షణను ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీలావతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రశాంత పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన విద్యార్థినులు

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణానికి చేయూత



సిమెంట్ అందజేస్తున్న సభ్యులు

తలకొండపల్లి: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అండగా నిలుస్తున్నాడు. మండలంలోని తాళ్లగుట్ట తండాకు చెందిన రాత్లావత్తు బుజ్జి, రాత్లావత్తు భారతిల నూతన ఇళ్ల నిర్మాణాలకు సోమవారం ట్రస్టు సభ్యులచే సిమెంట్, స్టీల్, కాంక్రీట్, ఇటుక, తదితర మెటీరియల్‌ను వెంకటేశ్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ పాండు, ఉప సర్పంచ్ శ్రీనివాసునాయక్, వార్డు సభ్యులు రఘునాయక్, రాములు, రాజు, బిచ్చునాయక్, తదితరులున్నారు.

ఘనంగా సీత్లా వేడుక



వేడుకలో భాగంగా పూజలు చేస్తున్న గిరిజనులు

కడ్తాల్: మండలంలోని మైసిగండిలో తొమ్మిది రోజుల పాటు జరిగే తీజ్ ఉత్సవాలను సోమవారం గ్రామంలోని పెద్దలు, యువత తమ సంప్రదాయాల ప్రకారం కులదేవత సీత్లాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీజ్ ఉత్సవాలు నిర్వహించే ప్రదేశంలో ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు చేశారు. ఈనెల 30న జరిగే వేడుకల్లో భాగంగా, తీజ్ బుట్టలతో వేలాది గిరిజనులు నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసీరాం నాయక్, నాయకులు రెడ్యానాయక్, హీరాసింగ్, జవహర్‌లాల్, పత్యానాయక్, చిన్నా, గోపాల్, రమేశ్, రాజు, నందనాయక్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండలంలోని చరికొండకు చెందిన గీత కార్మికుడు అబ్బయ్యగౌడ్ సోమవారం ఉదయం తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. బాధిత గీత కార్మికుడి కుటుంబాన్ని కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్, నాయకులు వెంకటేశ్వర్లుగౌడ్, కడ్తాల్ మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్‌గౌడ్, సర్పంచ్ భారతమ్మ , ఎంపీటీసీ రాములుగౌడ్, ఉపాధ్యక్షుడు లింగంగౌడ్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు లాల్‌కోట రాములుగౌడ్, నర్సింహగౌడ్, శ్రీశైలంగౌడ్, యాదయ్యగౌడ్, యాదయ్యగౌడ్, ముచ్చంగౌడ్, తదితరులు ఉన్నారు.

అభిమానం చాటుకున్న రవీందర్‌నాయక్



కొబ్బరికాయలు కొడుతున్న రవీందర్‌నాయక్

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై ఉన్న అభిమానాన్ని ఆమనగల్లు మండలం మేడిగడ్డకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రవీందర్‌నాయక్ చాటుకున్నాడు. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి సమీపంలో ఉన్న హనుమాన్ దేవాలయంలో సోమవారం జైపాల్‌యాదవ్‌కు టీఆర్‌ఎస్ టికెట్ రావాలని కోరుకుంటూ రవీందర్‌నాయక్ పూజలు నిర్వహించారు. స్వామికి 121 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, రాములునాయక్ పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

కడ్తాల్: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన, మండలంలోని చరికొండలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చరికొండ గ్రామానికి చెందిన గుడముళ్ల అబ్బయ్యగౌడ్(48), రోజులాగే సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు నడుముకు ఉన్న మోకు జారడంతో అబ్బయ్యగౌడ్ తాటి చెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య అండాలుతో పాటు, కుమారుడు కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు.